దుమ్ముతో నిత్యం నరకం

నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం నుంచి గొల్లగూడ వెళ్లే రోడ్డులో రహదారి నిర్మాణం చేపడుతున్నారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా కంకరపరిచడంతో వాహనాల రాకపోకలతో విపరీతంగా దుమ్ము లేస్తుంది. దీంతో వాహనదారులు, పాదాచారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. పనులు జరిగే ముందు ప్రతిరోజు కంకరరోడ్డుపై నీరు చల్లాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ






బస్టాండ్ ఎదుట రోడ్డులో దుమ్ములో ప్రయాణిస్తున్న వాహనదారులు

క్లుప్తంగా

మధుసూదన్‌రెడ్డికి సన్మానం



మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న గుమ్మల మోహన్‌రెడ్డి

నల్లగొండ : జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏపీఓగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఏదుళ్ల మధుసూదన్‌రెడ్డిని మంగళవారం పట్టణంలోని మంత్రి కోమటిరెడ్డి క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ రామచంద్రారెడ్డి, లక్ష్మయ్య, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

రామగిరి(నల్లగొండ) : నల్లగొండ పట్టణానికి చెందిన ఫొటోగ్రాఫర్ దాసరి ప్రశాంత్ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. మంగళవారం తెలంగాణ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం ప్రవేశపెట్టిన కుటుంబ భరోసా పథకం కింద రూ.10వేల చెక్కును బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పసుపులేటి కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట మోహన్‌రెడ్డి, రాష్ట్ర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం కోశాధికారి భీమిడి మాధవరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంధం ఉపేంద్రకుమార్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సామల వెంకటేశ్వర్లు, కుటుంబ భరోసా ఇన్‌చార్జ్ బొల్లగౌరి నాగరాజు, పట్టణ అధ్యక్షుడు కంభంపాటి రవి, ప్రధాన కార్యదర్శి దాశపత్రి జనార్దన్, పట్టణ ఉపాధ్యక్షులు కలీముల్లా, కోట శ్రీనివాస్, దుగ్యాల గణేష్, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్సీ సత్యం

చండూరు : మండలంలోని పుల్లెంల గ్రామానికి చెందిన కొండూరు శంకరయ్య అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం రూ.2.25లక్షల ఎల్‌ఓసీ చెక్కును మంగళవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యుడు నలపరాజు రామలింగయ్య, మండల కార్యదర్శి నలపరాజు సతీష్, సహాయ కార్యదర్శి బొడ్డు వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యుడు ఊషయ్య పాల్గొన్నారు.

యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శిగా క్రాంతి



శాలిగౌరారం : మండలంలోని అంబారిపేట గ్రామానికి యాదవ విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శిగా చెందిన నోముల క్రాంతియాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘం భవన్‌లో ఆ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగరాజుయాదవ్ చేతులమీదుగా నియామకపత్రం అందుకున్నట్లు క్రాంతియాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

నార్కట్‌పల్లి : రాజీవ్ యువ వికాస్ పథకంలో సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలని బీఆర్ఎస్ మండల ప్రచార కార్యదర్శి భాషపాక రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు పేద ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఎలాంటి షరతులు లేకుండా అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న ప్రతి లబ్ధిదారుడికి ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. సిబిల్ స్కోర్ పేరుతో యువతను ప్రభుత్వం మోసం చేస్తుందని ఆరోపించారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నూక కిరణ్‌కుమార్

శాలిగౌరారం : మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి నూక కిరణ్‌కుమార్‌యాదవ్ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచాలని కోరారు. బీసీలకు అన్ని రంగాలలో ప్రాధాన్యం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే వేముల వీరేశం



నకిరేకల్ : జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : రైతుల సంక్షేమ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తోందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మంగళవారం నాబార్డు వారి సహకారంతో నకిరేకల్, కట్టంగూర్ మండలాల ఎఫ్‌పీఓ ఆయిల్ ఫామ్ రైతులు క్షేత్ర స్థాయిలో సందర్శన నిమిత్తం ఖమ్మం జిల్లా అశ్వారావుపేటకు వెళ్తుతున్న బస్సును మంగళవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు క్షేత్రస్థాయిలో అక్కడ సాగవుతున ఆయిల్ ఫామ్ తోటలను పరిశీలించి మన ప్రాంతంలో వాటి విస్తర్ణం పెంచాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్, మున్సిపల్ చైర్‌పర్సన్లు గుత్తా మంజుల, చౌగోని రజితా, ఐబీఎస్ ప్రెసిడెంట్ వాడపల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.2లక్షల విరాళం

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలో నూతనంగా పునర్నిర్మాణం చేయనున్న గ్రామ దేవతలైన మారమ్మ, ముత్యాలమ్మ, కట్ట మైసమ్మ, కోట మైసమ్మ ఆలయాలకు ఎమ్మెల్యే వేముల వీరేశం మంగళవారం గ్రామపెద్దలకు రూ.2లక్షలు విరాళంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలు భక్తిభావం పెంపొందించుకోవాలన్నారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దూదిమెట్ల సత్తయ్య, ఐతరాజు యాదయ్య, పుల్లెంల అచ్చాలు, సట్టు సత్తయ్య, రాధారపు భిక్షపతి, సామ కొండల్‌రెడ్డి, మిరయాల రాములు, కమ్మంపాటి రాములు, ప్రజ్ఞాపురం విజయసింహ, సంపత్, లింగస్వామి, వెంకన్న తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు



చందుపట్ల పంచాయతీ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ వెంకటేశ్వర్లు

నకిరేకల్ : వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీఓ కంది వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని చందుపట్ల పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని నర్సరీలో మొక్కలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా జాగ్రత్తలు పడాలన్నారు. అదే విధంగా ఇంటి పన్నుల వసూళ్లు పెంచాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి సూర్యప్రకాష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఇమడపాక లక్ష్మీవెంకన్న, గోనె నర్సింహారావు ఉన్నారు.

సుఖేందర్‌రెడ్డిని కలిసిన డెయిరీ ఉద్యోగులు



మదర్ డెయిరీ ఉద్యోగులతో మాట్లాడుతున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ : పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని మంగళవారం నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకారం సంఘం మదర్ డెయిరీ ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా వారు మదర్ డెయిరీలోని పరిస్థితిని వివరించారు. అది మూతపడితే ఉద్యోగులు రోడ్డున పడతారని కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు. ఈ సందర్భంగా సుఖేందర్‌రెడ్డి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కలిసిన వారిలో ఉప్పల్ వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, హైమద్, చెన్నారెడ్డి, శ్రీనివాసరాజు, శివశంకర్, సత్యం, సైదులు, భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి దిష్టిబొమ్మ దహనం



జగ్గారెడ్డి దిష్టిబొమ్మతో బీజేపీ నాయకులు

చిట్యాల : మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వెంటనే క్షమాపణలు చెప్పాలని బీజేపీ మండలం అధ్యక్షుడు పీక వెంకన్న డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్దకాపర్తి గ్రామంలో మంగళవారం జగ్గారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం పాకులాడుతూ ప్రజల పక్షాన నిరంతరం ప్రశ్నించే ప్రతి పక్ష పార్టీల నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహాగౌడ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పున్న విష్ణు, నియోజకవర్గ కన్వీనర్ గరిషే నరేష్, బూత్ అధ్యక్షుడు సిలువేరు నర్సింహ, ఈరటి సురేష్, వెంకన్న పాల్గొన్నారు.

విద్యార్థులు మూఢనమ్మకాలు విడనాడాలి



విజ్ఞాన పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

తిప్పర్తి : విద్యార్థులు మూఢనమ్మకాలు విడనాడాలని ఎంఈఓ నర్సింహానాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ ఆశ్రమ పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పుస్తకాలలో ఉన్న విజ్ఞానాన్ని చదివి సమాజానికి ఉపయోగపడేలా ప్రతిఒక్కరూ తయారు కావాలన్నారు. సావిత్రీబాయి పూలే దేశానికి మొదటి మహిళ గురువు అన్నారు. స్త్రీలు విద్యావంతులైతే కుటుంబంతో పాటు దేశ అభివృద్ధి చెందుతుందన్నారు. మూఢనమ్మకాలపై పాటలతో, మ్యాజిక్‌తో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుకూరి సుదర్శన్, కస్తూరి ప్రభాకర్, జె.కొండల్‌రెడ్డి, ఎస్‌ఓలు నీలాంబరి, రాజరాజేశ్వరి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

కనగల్ : యువకుడిపై తప్పుడు కేసులు పెట్టి చిత్రహింసలకు గురిచేస్తున్న మండల పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్‌కు చెందిన కుంచం నవీన్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ప్రేమించుకున్నారని, వారు మేజర్లని పెళ్లి చేసుకునే హక్కు ఉందన్నారు. ఈ విషయంలో నవీన్ యువతిని కిడ్నాప్ చేశాడనే ఆరోపణలతో కనగల్ పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని, పోలీస్ ఉన్నతాధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండంపల్లి సత్తయ్య, సైదులు, కానుగు లింగస్వామి, సుల్తానా, నవీన్ బంధువులు పాల్గొన్నారు.

నవీన్‌కు సీపీఎం నాయకుల పరామర్శ

నల్లగొండ టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నవీన్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి మంగళవారం పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కనగల్ ఎస్ఐ, కానిస్టేబుల్ కలిసి నవీన్ కంట్లో కారం చల్లి రోకలిబండతో మోకాళ్లపై కొట్టి, మెడపై ఇనుప రాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని అన్నారు. సంబంధిత ఎస్ఐ, కానిస్టేబుల్‌పై ఎస్పీ చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని కోరారు. నవీన్ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఆయన కోరారు. ఆయన వెంట పార్టీ నాయకులు దండంపల్లి సత్తయ్య, అవుట సైదులు, కుంచెం యాదమ్మ, కుంచెం వెంకటేశ్వర్లు, శివ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

చిట్యాల : మండలంలోని పెద్దకాపర్తి, చిన్నకాపర్తి గ్రామాలలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయా గ్రామాలకు చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, కాంగ్రెస్ నాయకుడు ఆవుల సుందర్‌యాదవ్ మంగళవారం వేర్వేరుగా అందజేశారు. కార్యక్రమాలలో పెద్దకాపర్తి గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు నీలకంఠం లింగస్వామి, ఏర్పుల నర్సింహ, తెల్సూరి సైదులు, నల్లవెల్లి బుగ్గయ్య, ఏర్పుల వెంకన్న, చిన్నకాపర్తి నాయకులు మెట్టు వెంకటేశం, గంధం రాజ్‌కుమార్, గురిజ యాదగిరి, దేశపాక మధు, పోలిమెర పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు లేచిన వర్మీకంపోస్ట్ యార్డు పైకప్పు రేకులు



ఏపూరులో లేచిపోయిన కంపోస్ట్ యార్డు పైకప్పు

చిట్యాల : మండలంలోని ఏపూరు గ్రామంలో మంగళవారం సాయంత్రం భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఈదురుగాలులకు గాను గ్రామశివారులోని వర్మీకంపోస్ట్ యార్డు పైకప్పు రేకులు ఎగిరిదూరంగా పడిపోయాయి. అంతే కాకుండా పండ్లతోటలో కాయలు నెలరాలాయి.

లారీ డ్రైవర్ అదృశ్యం

చిట్యాల : మెడిసిన్ లోడుతో వెళ్తున్న ఓ లారీడ్రైవర్ అదృశ్యమైన ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని షోలాపూర్‌కు చెందిన లారీడ్రైవర్ అశ్వక్ హజిమాలంగ్ జమాదర్(30) లారీలో మెడిసిన్ లోడుతో షోలాపూర్ నుంచి శ్రీకాకుళం వెళ్తున్నాడు. మార్గమధ్యంలో మండలంలోని వట్టిమర్తి గ్రామపరిధిలోని జాతీయ రహదారి పక్కన గల న్యూపంజాబీ పాజి దాబా వద్ద ఈ నెల 10న లారీని నిలిపాడు. అనంతరం అతడు కనిపించకుండా పోయాడు. అతడి మొబైల్‌కు సోదరుడు ఇర్ఫాన్ హజిమాలంగ్ జమాదర్ ఫోన్ చేయగా స్విచ్‌ఆఫ్‌గా వచ్చింది. దీంతో జీపీఎస్ ద్వారా లోకేషన్‌కు వచ్చిన అతడి సోదరుడు తన సోదరుడు ఈ నెల 10నుంచి కనిపించకుండా పోయాడని మండల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మహాసభను జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షంరెడ్డి

మర్రిగూడ : మండల కేంద్రంలో ఈ నెల 31న జరిగే సీపీఐ మండల మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లెంకలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మహాసభకు గ్రామం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావాలని కోరారు. అనంతరం గ్రామ నూతన కార్యదర్శిగా బోడ అంజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జక్కల అంజయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలి

- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌నాయక్

మునుగోడు : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా ప్రతి కార్యకర్త చూడాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కె.శంకర్‌నాయక్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అనే నినాదంతో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పార్టీ ఆలోచనలు తెలియజేయాలన్నారు. నూతనంగా మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు నిజమైన నిరుపేదలకు అందేలా చొరవచూపాలన్నారు. పార్టీ సభ్యత్వాలు విరివిగా పెంచి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలిచేలా కృషిచేయాలన్నారు. అదే విధంగా నూతనంగా గ్రామ కమిటీలు, మండల కమిటీలతో పాటు అనుబంధ సంఘాల కమిటీలను ఎన్నుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అబ్జర్వర్ నాసిర్ అహ్మద్, చండూరు మార్కెట్ చైర్మన్ దోటి నారాయణ, మునుగోడు, చండూరు, నాంపల్లి, మర్రిగూడ, గట్టుప్పల్ మండల అధ్యక్షులు భీమనపల్లి సైదులు, ఓంకారం, రవీందర్‌రెడ్డి, రాందాసు శ్రీను, జగనాథం, అనంత చంద్రశేఖర్, రవీందర్‌రావు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో ‘ఊయల’ సెంటర్ ఏర్పాటు



ఊయల సెంటర్‌ను ప్రారంభిస్తున్న సీడీపీఓ అస్రఅంజుమ్, సూపరింటెండెంట్ శోభారాణి

నకిరేకల్ : అప్పుడే పుట్టిన పిల్లలు భారంగా భావించి వద్దనుకునే వారి శిశువులను సంరక్షించేందుకు పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ మిషన్ వాత్సల్య పథకం కింద ఊయల బేబీ రిసెప్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌ను మంగళవారం ఏరియా ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ అస్రఅంజుమ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభారాణి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఇటీవల కాలంలో తల్లిదండ్రులు తమకు పుట్టిన పిల్లలు భారంగా భావించి శిశువులను చెట్లపొదల్లో, మురికికాల్వల్లో వదిలేసి వెళ్తున్నారని అన్నారు. అలా వదిలి వేయబడిన చాలా మంది శిశువులు మరణిస్తున్నారని, అది గమనించిన కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఊయల సెంటర్‌ను ఏర్పాటు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవానీ, సునీత, అంగన్‌వాడీ టీచర్లు కమల, కవిత, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన సౌడమ్మ జాతర



సౌడమ్మ అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు

కేతేపల్లి : మండల కేంద్రంలో యాదవులు సౌడమ్మ, లింగమంతులస్వామి జాతరను రెండో రోజు మంగళవారం కూడా వైభవంగా నిర్వహించారు. మహిళలు సౌడమ్మ దేవతకు నైవేద్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా యువతీ, యువకుల కోలాటాలు, మాణిక్యమ్మ వేషధారణ అందరినీ అలరించాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం వేళ వ్యవసాయ క్షేత్రాలలో వదిలిన పొడుపు గొర్రెను పట్టుకునేందుకు యువకులు పోటీలు పడ్డారు. వేడుకలో మాజీ సర్పంచ్ జటంగి ముత్తమ్మ, మాజీ ఎంపీటీసీ ఎర్రబోయిన వెంకన్న, యాదవ సంఘం ప్రతినిధులు వి.అబ్బయ్య, ఉప్పల సైదులు, కానాని అచ్చయ్య, జటంగి వెంకన్న, ఉప్పల సోమలింగం, జటంగి పాపయ్య, పగడాల గంగయ్య, పగడాల లింగయ్య, దువ్వని ఎర్రయ్య, బొల్క శివ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మన్మథరెడ్డి

శాలిగౌరారం : బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు నిరంతరం కృషి చేయాలని ఆ పార్టీ మండల ఎన్నికల ఇన్‌చార్జ్ మన్మథరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల కార్యవర్గం ఎన్నిక సందర్భంగా కార్యకర్తల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో సుస్థిరమైన, సమర్థవంతమైన పాలన అందించడం బీజేపీతోనే సాధ్యమన్నారు. మండల కార్యవర్గం కూర్పు కోసం ప్రతిపాదిత సభ్యుల జాబితాను పార్టీ అధిష్టానానికి నివేదించిన అనంతరం కార్యవర్గాన్ని ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో పార్టీ సూర్యాపేట జిల్లా కౌన్సిల్ మెంబర్ జమ్ము రమేశ్, మండల అధ్యక్షుడు తోట వినోద్, నాయకులు గిరగాని యాదగిరి, కొండ్రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, తోట యాదగిరి, షేక్ సయ్యద్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ



చిట్యాల : చేపల లోడుతో వెళ్తున్న ఓ లారీ మంగళవారం తెల్లవారుజామున పట్టణంలోని జాతీయ రహదారిపై పోలీస్‌స్టేషన్ ఎదురుగా డివైడర్‌పైకి దూసుకెళ్లింది. పట్టణంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు జరుగుతుండడంతో వాహనాలను జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డులోకి డైవర్షన్ చేశారు. దీంతో గమనించని లారీ డ్రైవర్ హైదరాబాద్ వైపుకు వెళ్తూ ప్రమాదవశాత్తు డివైడర్‌పైకి తీసుకెళ్లాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని డివైడర్‌పైకి వెళ్లి నిలిచిన లారీని జేసీబీలతో పక్కకు తరలించారు.

నర్సరీల్లో ముమ్మరంగా మొక్కల పెంపకం

- నల్లగొండ మండలంలో 31 గ్రామాల్లో నర్సరీలు
- 2.45 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యం
- ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు



అన్నెపర్తి నర్సరీ

రామగిరి(నల్లగొండ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవంలో భాగంగా ప్రతి పల్లెలో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కల పెంపకం చేపట్టారు. నల్లగొండ మండల పరిధిలోని 31 గ్రామపంచాయతీల్లో ప్రభుత్వ లక్ష్యం మేరకు మొక్కలను పెంచుతున్నారు. జూన్ మాసం నాటికి 2.45 లక్షల మొక్కలను సిద్ధంగా ఉంచాలని అధికారులు భావిస్తున్నారు. ప్రతి నర్సరీలో 8 వేలకు తగ్గకుండా మొక్కలను పెంచి జూన్‌లో హరితహారం కార్యక్రమంలో నాటేందుకు సిద్ధం చేస్తున్నారు. మొక్కలు వేసవిలో ఎండిపోకుండా గ్రీన్‌నెట్లు ఏర్పాటు చేశారు. గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది ఉదయం, సాయంత్రం వేళల్లో కూలీలతో నీటిని పోయిస్తూ మొక్కలను సంరక్షిస్తున్నారు. పంచాయతీల్లో రైతులకు అవసరమైన టేకు మొక్కలు, ఇంటి అవసరాలకు అవసరమైన పూలు, క్రోటన్స్, పండ్ల మొక్కలను ఇంటింటికీ పంచేందుకు సిద్ధం చేస్తున్నారు.

4 కేటగిరీలుగా మొక్కలు..

వన మహోత్సవంలో నాటనున్న మొక్కలను 4 కేటగిరీలుగా విభజించారు. ఎవెన్యూ ప్లాంటేషన్ 20 శాతం, కమ్యూనిటీ ప్లాంటేషన్ 20 శాతం, బండ్ ప్లాంటేషన్ 20 శాతం, హోమ్ స్టీడ్ 15 శాతం, ఎక్సైజ్ 10 శాతం, బయో ఫెన్సింగ్ 10 శాతం, ఇరిగేషన్ 5 శాతంగా విభజించి వాటికి అనుగుణంగా మొక్కలను పెంచుతున్నారు. ప్రస్తుతం బ్యాగ్‌ల్లో ప్లాంటేషన్ చేశారు. జూన్, జూలై నాటికి లక్ష్యాన్ని బట్టి మొక్కలు అందించేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేసుకున్నారు.

జూన్ నాటికి మొక్కలు సిద్ధం

“ హరితహారం కార్యక్రమంలో భాగంగా జూన్ నాటికి నల్లగొండ మండలం నుంచి మొక్కలను సిద్ధం చేస్తున్నాం. నర్సరీల్లో వివిధ రకాల మొక్కలు పెంచుతున్నాం. వర్షాలు కురవగానే ప్రభుత్వ ఆదేశాల మేరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపడతాం. ప్రభుత్వ ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకుంటాం.

– స్వార్తిరెడ్డి, ఈజీఎస్ ఏపీఓ, నల్లగొండ